# పేరుకు మేజరు..అభివృద్ధిలో మైనరు

**అవి పేరుకే మేజర్ పంచాయతీలు... అభివృద్ధిలో చూస్తే మైనరు పంచాయతీల కన్నా ఘోరం... మండల కేంద్రమైన బంటుమిల్లితో పాటు అర్తమూరు, పెదతుమ్మిడి, మల్లేశ్వరం మేజరు పంచాయితీల్లో కనీస మౌలిక సౌకర్యాలు కరువు.**

- కానరాని కనీస సౌకర్యాలు
- కుళాయిల్లో గ్లాసు నీరు రాదాయే!
- అస్తవ్యస్తంగా అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్డు మార్జిన్లే డంపింగ్ యార్డులు


అంతర్గత డ్రైన్ లేక రోడ్డుపైన మురుగునీరు నిలబడ్డ బంటుమిల్లి గణేష్‌కాలనీ

**బంటుమిల్లి:** మండలంలో బంటుమిల్లి, పెదతుమ్మిడి, అర్తమూరు, మల్లేశ్వరం మేజరు పంచాయతీలుగా ఉన్నాయి. పేరుకు మేజరు పంచాయతీలే గాని మౌలిక సౌకర్యాల్లో ఆమడదూరంలో ఉన్నాయి. కనీస సౌకర్యాలైన తాగునీరు, అంతర్గత డ్రైనేజి వ్యవస్థ లేదు. ఒక్క బంటుమిల్లిలో తప్ప మిగిలిన మూడు పంచాయతీల్లో డంపింగ్ యార్డులు లేవు. ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి తాగునీరు పేరుతో లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నా పంచాయతీల్లో గుక్కెడు తాగునీటికి దిక్కులేదు. బంటుమిల్లి కాలనీలతో పాటు పెదతుమ్మిడి, అర్తమూరు, మల్లేశ్వరం గ్రామాల్లో అంతర్గత డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటితో రోడ్లన్నీ బురదకయ్యలను తలపిస్తుంటాయి. ఈ నాలుగు గ్రామాల్లోను అధికారులు గుర్తించిన డంపింగ్ యార్డు స్థలాలు పలువురి ఆక్రమణలో ఉన్నాయి. పెదతుమ్మిడి పంచాయతీలో డంపింగ్ యార్డు గ్రామానికి దాదాపు 2 కి.మీ దూరంలో ఉండటంతో నిరుపయోగంగా తయారైంది. దీంతో పంచాయతీ సిబ్బంది గ్రామంలో చెత్తను వైవాక, బంటుమిల్లి, గుడివాడ రోడ్డు మార్జిన్లలో పడేసి చేతులు దులుపుకొంటున్నారు. అర్తమూరు, మల్లేశ్వరం గ్రామాల్లోను ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

### అస్తవ్యస్తంగా అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ

బంటుమిల్లి, పెదతుమ్మిడి, అర్తమూరు, మల్లేశ్వరం మేజరు పంచాయతీల్లో అంతర్గత డ్రైనేజి వ్యవస్థ దారుణంగా తయారైంది. బంటుమిల్లిలో డ్రైనేజి ఉన్నా ఆక్రమణల కారణంగా వాటిని శుభ్రం చేయడం పంచాయతీ సిబ్బందికి తలకు మించిన భారంగా తయారైంది. స్థానికులు డ్రైనేజి కాలువను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేసి అద్దెలకు ఇచ్చినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. బంటుమిల్లి ప్రధాన వీధిలో ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గత 20 సంవత్సరాల్లో బంటుమిల్లిలో ఏర్పడ్డ గణేష్, బీసీ, బీఎస్ఆర్ కాలనీల్లో నేటి వరకు అంతర్గత డ్రైనేజీ నిర్మాణం చేయకపోవడంతో రోడ్లపై నిత్యం మురుగు నీరు పొంగి పొర్లుతుంటుంది. అర్తమూరు, మల్లేశ్వరం గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్తులు మురుగునీటిని డైరెక్టుగా రోడ్లపైకి వదులుతున్నారు.

### జోరుగా ఆర్‌ఓ ప్లాంట్ల వ్యాపారం

మండలంలో ప్రభుత్వాలు తాగునీటి పేరుతో లక్షలు ఖర్చు చేస్తున్నా ప్రజలు మాత్రం ఆర్‌ఓ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నారు. దీంతో గ్రామ, గ్రామాన ఆర్‌ఓ ప్లాంట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. బంటుమిల్లి పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న మైక్రోప్లాంటు మూత పడి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. బంటుమిల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకం వద్ద దాదాపు 15 ఎకరాల భూమి కొన్నా ఉపయోగంలోకి రాలేదు. మల్లేశ్వరం, పెదతుమ్మిడి, అర్తమూరు గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలు మూలపడటంతో ఈ గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్ల వ్యాపారం మహా జోరుగా సాగుతోంది.


మరమ్మతులకు గురై మూతపడ్డ బంటుమిల్లి మైక్రోప్లాంటు

### వాగ్దానాలకే పరిమితం

మండలంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్న పాలకుల మాటలు వాగ్దానాలకే పరిమితమయ్యాయి. ప్రజలు గత్యంతరం లేక ఆర్‌ఓ ప్లాంట్ల నీళ్లు తాగుతున్నారు. ఆర్‌ఓ ప్లాంట్లపై పర్యవేక్షణ లేదు. తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయించి అనుభవం కలిగిన సిబ్బందిని నియమిస్తే అవి సద్వినియోగం అవుతాయి.

– మాజేటి శ్రీనివాసరావు, సీపీఎం డివిజన్ కార్యదర్శి, బంటుమిల్లి

## చెరువు గట్టు హాంఫట్‌పై ‘మీకోసం’లో ఫిర్యాదు

**పెడన:** ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.11లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నడుపూరు గ్రామ పంచాయతీ మంచినీటి చెరువు గట్టు మట్టిని తోలడంపై సోమవారం ‘మీకోసం’లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నెల 26న ‘సాక్షి’లో ‘చెరువు గట్టు హాంఫట్’ అంటూ కథనం వెలువడిన విషయం పాఠకులకు విదితమే. దీనిపై గ్రామస్తులు ఈనెల 27న చెరువు గట్టు మీద ఉన్న పొక్లయిన్, ట్రాక్టర్ వెళ్లే వరకు నిరసన తెలియజేశారు. సర్పంచ్ భర్త చీర్ల కృష్ణ మట్టి తవ్వడమే కాకుండా విక్రయిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రఫీకుద్దీన్ విధులకు రాకుండా అతని కుమారుడు విధులకు హాజరవుతూ పంచాయతీ తీర్మానాలు చేయడం ఎంతవరకు సబబు అంటూ గ్రామస్తులు మచిలీపట్నం ఆర్డీవో స్వాతికి ఫిర్యాదు చేశారు. ఆమె జిల్లా పంచాయతీ కార్యాలయం, డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయానికి తెలియజేసి విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు.

## ప్రతి సమస్యకు పరిష్కారం

**కోనేరుసెంటర్:** మీకోసంలో అందిన ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో విచారణ జరిపించి పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరి కొన్ని అర్జీలను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత స్టేషన్‌లలో బాధితులకు న్యాయం జరగకుంటే తనను స్వయంగా కలిసి విషయాన్ని వివరించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కృష్ణాడెల్టా పరిరక్షణకు జస్టిస్ అంబటి ఎనలేని సహకారం

**సంతాపసభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్**



**అవనిగడ్డ:** కృష్ణాడెల్టా పరిరక్షణకు జస్టిస్ అంబటి లక్ష్మణరావు సహకారం మరువలేనిదని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం జస్టిస్ అంబటి లక్ష్మణరావు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణాడెల్టా సంక్షోభంలో ప్రముఖ సాగునీటి సంఘ నిపుణుడు అక్కినేని భవానీ ప్రసాద్‌తో కలసి ఆయన చేపట్టిన కార్యక్రమాలు రైతులకు ఎంతో మేలు చేశాయన్నారు. కార్యక్రమంలో అక్కినేని భవానీ ప్రసాద్, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, మత్తి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పల్లెపండుగతో గ్రామీణ రోడ్లకు మహర్దశ

**ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్**

**కృత్తివెన్ను:** పల్లెపండుగ పేరుతో అన్ని గ్రామ పంచాయతీలలో అంతర్గత రహదారులకు మహర్దశ రానుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని సీతనపల్లి, చెరుకుమిల్లి పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. సీతనపల్లి పంచాయతీలో రూ.30 లక్షలతో, చెరుకుమిల్లి పంచాయతీలో రూ.25 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎంపీపీ

**బంటుమిల్లి:** మండల పరిధిలోని పెదతుమ్మిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ వి.చినబాబు సోమవారం సందర్శించారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనం నిర్వహణను పరిశీలించిన ఆయన పాఠశాలలో విద్యార్థులు తక్కువగా భోజనం చేయడంపై విచారణ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేసిన ఆయన మిగిలిన విద్యార్థులు కూడా పాఠశాలలో భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**పెడన:** కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో పట్టణంలోని శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంతో పాటు బ్రహ్మపురం, శ్యామలాంబ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావుతో కలిసి అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

### రెప్కో హోమ్ ఫైనాన్స్ బ్రాంచ్ ప్రారంభం

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని రేవతి సెంటరులో నూతనంగా ఏర్పాటు చేసిన రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్‌ను సోమవారం ఆ సంస్థ రీజనల్ మేనేజర్ ఆర్.సెల్వం, రీజనల్ డెవలప్‌మెంట్ మేనేజర్ కె.ఇళయరాజా ప్రారంభించారు. బ్రాంచ్‌లో తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 29 బ్రాంచ్‌లు ఉన్నాయని, గృహ నిర్మాణానికి, గృహ కొనుగోలుకు, మార్టిగేజ్ తదితర గృహ రుణాలను తమ బ్రాంచ్ ద్వారా ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎంజే నరేష్ కుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

### గ్రామసభలో 13 అర్జీలు

**వి.రుద్రవరం(ఘంటసాల):** ఘంటసాల మండలం వి.రుద్రవరం గ్రామంలో రీ సర్వే భూ సమస్యల పరిష్కారానికి సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తమ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 13 మంది రైతులు అర్జీలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎనిగళ్ల రామకృష్ణ, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీపుష్ప పాల్గొన్నారు.

### విద్యార్థి దశలోనే ప్రతిభకు పదును పెట్టాలి

**కృత్తివెన్ను:** చదువుకునే వయస్సులోనే విద్యతో పాటు అన్ని రంగాలలోనూ విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టాలని ఎంఈవో బాల త్రిపురసుందరీదేవి అన్నారు. మండలంలోని సంగమూడి ఉన్నత పాఠశాలలో సోమవారం క్రాఫ్ట్ డిమానిస్ట్రేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని విజయవాడకు చెందిన హ్యాండ్ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ వారు నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు హస్తకళలో మెలకువలను వివరించి ప్రదర్శించారు. మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బుధవారం ముగింపు కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎంఈవో-2 ఎస్‌కేడీవీ ప్రసాదరావు తెలిపారు.

# గొల్లపాలెంలో ఆక్రమణలు తొలగించాలి


ఘంటసాలలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు అర్జీ ఇస్తున్న గొల్లపాలెం గ్రామస్తులు

**ఘంటసాల:** జెడ్పీ రోడ్డు, కాలువగట్లు, పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ ఘంటసాల మండలం పాపవినాశనం గొల్లపాలెం గ్రామస్తులు ఇన్‌చార్జి ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, డీటీ బి.కనకదుర్గ, ఇరిగేషన్ ఏఈ కె.ప్రసాద్‌లకు సోమవారం వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపవినాశనం పంచాయతీ శివారు గొల్లపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ రోడ్డు, పీబ్ల్యూడీ కాలువ స్థలాలు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయన్నారు. ఆర్.ఎస్.నెం. 601లోని కాలువ గట్టు, ఆర్.ఎస్.నెం.596 లోని ప్రభుత్వ భూమి జిల్లా పరిషత్ రోడ్డుకి ఆనుకుని ఆయా భూములకు ఇరువైపులా ఆక్రమించుకుని దారి లేకుండా చేసి పిల్లర్లు పోసి ప్రహరీ కడుతున్నారని చెప్పారు. ఈ కాలువ కింద పాపవినాశనం, గోగినేనిపాలెం, చినకళ్లేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 400 నుంచి 500 ఎకరాలకు సాగు భూమి ఉందని, పండిన ధాన్యం, వరిగడ్డి తరలించుకోవాలన్నా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడతామన్నారు. ఈ విషయమై తాము ప్రశ్నిస్తే మీకు చేతనైంది చేసుకోండి, దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. జిల్లా పరిషత్‌కు మరోవైపు ఇద్దరు వ్యక్తులు రోడ్డు మీదకు గోడలు కట్టి దుకాణాలు ఏర్పాటు చేశారని చెప్పారు. అర్జీలు సమర్పించిన వారిలో కె.కాంతారావు, జి.శేషయ్య, డి.వసంతరావు, జి.నాగరాజు, డి.ప్రసాద్, జి.రామదాసు, జి.నాగరాజు, డి.భాస్కరరావులతో పాటు 15 మంది రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

## బాణసంచా దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన


దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు

**పెడన:** బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయడానికి పెడన–గుడివాడ బైపాస్ రోడ్డులో గత ఏడాది కేటాయించిన ప్రదేశాన్నే అధికారులు సోమవారం సాయంత్రం పరిశీలించారు. సుమారు 20 దుకాణాలను ఏర్పాటు చేయడానికి స్థలం అనువుగా ఉంటుందా లేదా, రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా ఉందా, ఆయా శాఖలు పేర్కొన్న నిబంధనల మేరకు స్థలాన్ని పరిశీలించి ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం 17 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా పెరగడానికి ఆస్కారం ఉండటంతో 20 దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా ఉందా లేదా అని పరిశీలించామన్నారు. స్థలం గల వారితో పాటు చుట్టుపక్కల రైతులు పలు అభ్యంతరాలు తెలియజేశారు. సామగ్రి విక్రయించుకున్న అనంతరం చెత్తాచెదారం ఎత్తకుండా అలా వదిలి వేయడం ద్వారా పక్కన ఉన్న పంట పొలాల్లో గాలికి వచ్చి పడుతున్నాయని, ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఎ.వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఆర్ఐ విజయలక్ష్మి ఉన్నారు.

## రాష్ట్ర స్విమ్మింగ్ సెలక్షన్స్‌కు లంక హైస్కూలు బాలికలు


రాష్ట్ర స్విమ్మింగ్ సెలక్షన్స్‌కు ఎంపికైన హైస్కూలు బాలికలు విన్నీ, అశ్విని

**నాగాయలంక:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్‌లో నాగాయలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు కొక్కిలిగడ్డ విన్నీ, నాగిడి అశ్విని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం వీవీఎస్‌వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. పెనమలూరు బ్లూమింగ్‌బెల్ ఇంటర్నేషనల్ స్కూలులో జరిగిన కృష్ణాజిల్లా సెలక్షన్స్‌లో అండర్–17 విభాగంలో 200, 100మీటర్ల ఫ్రీస్టైల్, 100మీ. బ్యాక్ స్ట్రోక్‌లో విన్నీ, 50మీ, 200మీ. ఫ్రీస్టైల్, 100మీ. బ్యాక్ స్ట్రోక్‌లో అశ్విని రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. నవంబరు 5న నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ సెలక్షన్స్‌లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన బాలికలు, తర్ఫీదు ఇచ్చిన పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావులను సీఎంసీ చైర్మన్ వక్కపట్ల మారుతి, ఉపాధ్యాయులు అభినందించారు.

## కొత్తగా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయాలి


జేసీ గీతాంజలి శర్మకు అర్జీ ఇస్తున్న తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు

**ఘంటసాల:** తెలుగురావుపాలెం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయాలని కోరుతూ తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు సోమవారం మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల కొరకు శ్రీకాకుళం గ్రామంలో పొలాన్ని కొనుగోలు చేసి కేటాయించిందని, అయితే లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు వెళితే భూ యజమాని కుటుంబ సభ్యులు కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఆగిపోయారన్నారు. ఈ ఏడాది ఆగస్టు 9న కోర్టు వారు భూయజమాని కుటుంబసభ్యులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. తమ గ్రామంలో కొత్తగా ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన జేసీ గీతాంజలి శర్మ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ ప్రసాద్ బాబు చెప్పారు.

### రీ సర్వేపై గ్రామసభలు

**టేకుపల్లి(మోపిదేవి):** రీ సర్వేతో రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు అన్నారు. మండలంలోని కప్తానుపాలెంకు చెందిన రీ సర్వే ప్రాజెక్టుపై పెదప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. మండల సర్వేయర్ రామకృష్ణబాబు రైతుల నుంచి పలు అభ్యంతరాలపై అర్జీలు స్వీకరించారు.

**లేళ్లగరువులో..**

**గూడూరు:** లేళ్లగరువు పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. డీటీ కె.సాయి భూ సమస్యలు ఏర్పడిన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

### 2 నుంచి కార్తిక మాసోత్సవాలు

**నాగాయలంక:** స్థానిక శ్రీపార్వతీసమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయకమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలో నవంబర్ 2 నుంచి డిశంబరు 1 వరకు 32వ వార్షిక కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజ్య గురుదేవులు కె.భానుప్రసాద్ ఆశీస్సులతో శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్యమంగళ శాసనాలతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో ఈ నెల రోజులు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని క్షేత్రం చైర్మన్ లయన్ ఆలూరి శ్రీనివాసరావు చెప్పారు.

## రేపు కౌన్సిల్ సాధారణ సమావేశం

**పెడన:** పెడన పురపాలక సంఘ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 17 అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

## 26న వర్గీకరణ వ్యతిరేక ఉద్యమ సభ

**చిలకలపూడి(మచిలీపట్నం):** ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కర్ర సునీల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నవంబరు 26వ తేదీన గుంటూరు జిల్లాలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఆర్ఎస్ ఉద్యోగి ఉప్పులేటి దేవీప్రసాద్, జై భారత్ పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ హాజరవుతారన్నారు. ఈ సభకు వేలాది మంది తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ఉపాధి నిధులు సద్వినియోగం అయ్యేలా చూడండి

**కోసూరువారిపాలెం(మోపిదేవి):** పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో గ్రామాల్లో సీసీ రోడ్లకు ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరు చేసిన నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరుతూ జనసేన నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు స్పందనలో వినతిపత్రం అందజేశారు. కోసూరువారిపాలెంకు మంజూరైన నిధులతో ఆర్సీ కరకట్ట పక్కన సీసీ రోడ్డు వేస్తున్నారని, భవిష్యత్తులో కరకట్ట విస్తరణలో సీసీ రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని, అందువల్ల కరకట్టకు రెండు మీటర్లు వదిలి రోడ్డు వేస్తే నిధులకు న్యాయం చేసిన వారవుతారని సూచించారు.

## అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు పరిశీలించిన కేంద్ర బృందం


ఉల్లిపాలెం వద్ద స్లూయిస్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

**కోడూరు:** దివి సీమ ఎడమ కరకట్ట పరిధిలో ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను ఇరిగేషన్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని విశ్వనాథపల్లి, పిట్టల్లంక, కోడూరు గ్రామాల్లో సెంట్రల్ టీం అధికారులు పర్యటించారు. లింగన్నకోడు డ్రైన్‌పై ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల ప్రస్తుత పరిస్థితి, వాటి పనితీరును పరిశీలించారు. స్లూయిస్‌ల సామర్థ్యంతో పాటు కట్టడాల పటిష్టత, షట్టర్ల పనితీరుపై ఆరా తీశారు. స్లూయిస్‌లు దెబ్బతినడం వల్ల సముద్ర నీరు ఎగువ ప్రాంతాలకు చొచ్చుకు రావడాన్ని టీం సభ్యులు స్వయంగా పరిశీలించారు. నూతన స్లూయిస్‌ల పునర్నిర్మాణాల అవశ్యకతపై ఉన్నత అధికారులకు నివేదించనున్నట్లు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ ఎం.ఎస్.వి.వేణుగోపాలరావు తెలిపారు. అనంతరం అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ఎత్తు, గేట్ల కొలతలను పరిశీలించారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ డీఈ ఎం.నాగలక్ష్మి, ఏఈ కె.నిహారిక, ఇరిగేషన్ డీఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

**పెదకళ్లేపల్లిలో..**

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల ప్రస్తుత పనితీరు, సామర్థ్యాన్ని సోమవారం ఇరిగేషన్ శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఈఈ ఎంఎస్‌వీ వేణుగోపాలరావు బృందం పరిశీలించింది. మండలంలోని పెదకళ్లేపల్లి, అయోధ్య, ఉత్తర చిరువోలులంక కృష్ణాకరకట్టపై ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు, మంగలివానిసింక్ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్‌ఫాల్ స్లూయిజ్ కట్టడాల పటిష్టత, షట్టర్ల పనితీరు పరిశీలించి స్లూయిజ్‌ల పునర్నిర్మాణాల ఆవస్యకతపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. డీఈఈ ఎం.నాగలక్ష్మి, ఏఈ కె.నిహారిక, అవనిగడ్డ ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అనధికార లే అవుట్ల ధ్వంసం


రామరాజుపాలెంలో అక్రమ లే అవుట్‌లో రోడ్డును ధ్వంసం చేయిస్తున్న ఎంయూడీఏ అధికారులు

**గూడూరు:** గూడూరు మండలంలో వెలసిన అనధికార లే అవుట్లపై ఎంయూడీఏ అధికారులు దృష్టి సారించారు. మండలంలోని రామరాజుపాలెం పరిధిలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్లు వేశారు. అనధికార లేఅవుట్లపై ఫిర్యాదులు రావడంతో ఎంయూడీఏ అధికారులు రంగంలోకి దిగారు. ఎంయూడీఏ ప్లానింగ్ అధికారి డి.శాంతిలత ఆధ్వర్యంలో సోమవారం వీఆర్వో జి.శ్రీకాంత్, గ్రామ సర్వేయరు జొన్నలగడ్డ విజయ్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అక్రమ లేఅవుట్‌ను నిర్ధారించిన అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ సహాయంతో లే అవుట్‌లో వేసిన రోడ్డును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శాంతిలత మాట్లాడుతూఎంయూడీఏ పరిధిలో 300 చదరపు మీటర్లు పైబడి ఉన్న భవన నిర్మాణాలతో పాటు కమర్షియల్ నిర్మాణాలకు తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు.

## గుంటూరు లాంలో పీఏసీఎస్ ప్రతినిధులకు శిక్షణ



గుంటూరు లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ పొందుతున్న పీఏసీఎస్ ప్రతినిధులు

**ఘంటసాల:** సమగ్ర పోషక యాజమాన్యం శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని రైతులకు ఉపయోగకరంగా వినియోగించాలని అభ్యర్థులకు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆరవ రోజు సోమవారం గుంటూరు లాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, అమరావతిలోని వ్యవసాయ పరిశోధనా స్థానంలను సందర్శించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షా విధానం, ఆవశ్యకత, భూసార పరీక్ష ఫలిత ఆధారిత ఎరువుల యాజమాన్యం, సమస్యాత్మక భూముల యాజమాన్యం, తదితర అంశాలపై మృత్తిక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సుజనీరావు వివరించారు. ప్రాంతీయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ దుర్గా ప్రసాద్ విజ్ఞాన యాత్రకు విచ్చేసిన అభ్యర్థులకు శిక్షణ ప్రాముఖ్యతను తెలిపారు. అమరావతి పరిశోధనా స్థానంలో జీవన ఎరువుల రకాలు, వాటి తయారీ విధానం, వినియోగం, ఉపయోగాలు, ఇతర అంశాల గురించి డాక్టర్ రవీంద్ర రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త, కోర్సు ఇన్‌చార్జి డాక్టర్ కె.రేవతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

**రేమాలవారిపాలెం(నాగాయలంక):** విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని నాగాయలంక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన బాలలకు బ్యాంకు మేనేజర్ ఎస్.ఈశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. 20మంది బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ, బ్యాంకు డెప్యూటీ మేనేజర్ సౌరభ్‌కుమార్, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైన గురుకుల విద్యార్థులు



**మోపిదేవి:** రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు మోపిదేవి గురుకుల పాఠశాల విద్యార్థులు జె.అదీప్(10), వై.అక్షయ్‌కుమార్(9), ఎం.ఏడుకొండల స్వామి(8) ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.